క్లుప్తంగా

లంకమ్మకు ఘటం బిందెల సమర్పణ



అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారికి రెండో వార్డులోని కొనకళ్ల సుబ్బారావు కుటుంబానికి చెందిన 17 మంది ఒకేసారి ఘటం బిందెలు సమర్పించారు. కొనకళ్ల కాంప్లెక్స్ నుంచి 17 మంది కొనకళ్ల కుటుంబీకులు ఒకేసారి ఘటం బిందెలు ఎత్తుకుని లంకమ్మ అమ్మవారి ఆలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. తీన్మార్ డప్పులు, డప్పు వాయిద్యాలు నృత్య ప్రదర్శన చేస్తూ ప్రత్యేక ప్రభతో తరలి వెళ్లిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దారి పొడవునా భక్తులకు పానకం అందించారు.

అగ్ని బాధితునికి సాయం



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం దేవరకోట ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఆటో డ్రైవర్ కొడాలి వెంకటేశ్వరరావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు స్పందించి దాతల సహాయంతో ఈ మొత్తాన్ని సమకూర్చారు. వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, ఎంపీటీసీలు కొడాలి నాగార్జున, దిరిశం వెంకట లక్ష్మీ, కొప్పుల రాములమ్మ, కొల్లూరి విజయ, కొండేటి నీలవేణి, సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

బందరులో 96.01 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ ఆదివారం రెండో రోజు నగరంలో 96.01 శాతం పూర్తయింది. వలంటీర్లు లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందజేశారు. నగరంలో 18,460 మంది పింఛనుదారులు ఉండగా ఆదివారం నాటికి 17,724 మందికి అందజేశారు. ఇంకా 736 మందికి పింఛన్ సొమ్ము అందిస్తే 100 శాతం పంపిణీ పూర్తవుతుంది. జిల్లాలో పింఛను పంపిణీలో నగరం ద్వితీయ స్థానంలో ఉంది.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: చల్లపల్లి గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి వేద పండితులచే ప్రత్యేక పూజలు చేసి విశేష అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ఉప్పల సుబ్బారావు, యార్లగడ్డ శివయ్య, బళ్లా మధు, నరేంద్ర, రాఘవ పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

రామవరప్పాడు: లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మి పాలిక్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. లక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి సంపత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నామమాత్రపు ఫీజులతో ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, సర్పంచ్ వరి శ్రీదేవి, జెడ్పీటీసీ సువర్ణరాజు పాల్గొన్నారు.

అగ్రి ల్యాబ్.. అద్భుత సేవలు

- రెండేళ్లుగా నియోజకవర్గ పాడి రైతులకు సేవలు
- పదివేలకు పైగా పశువులకు వైద్య పరీక్షలు
- సంచార వాహనాల ద్వారా పశు వైద్యం



డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల



పశువుల అత్యవసర సేవలకు వినియోగిస్తున్న 1962 వాహనం

పెడన: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నివర్గాలతో పాటు పాడి రైతులకు మేలు చేకూరేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే పాల ధరలను పెంచుతూ వారి ఆర్థికాభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. పాడి రైతుల పశు సంపద ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (అగ్రి ల్యాబ్)ను పెడనలో ఏర్పాటు చేసింది. రెండేళ్ల కిందట పెడన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్ ద్వారా పాడి పశువులకు ఆరోగ్య పరీక్షలు చేసి వెంటనే చికిత్స అందేలా చర్యలు తీసుకుంటోంది. మండల స్థాయిలో చూపించిన అనంతరం వివిధ పరీక్షల నిమిత్తం ఆయా పశువుల రక్తం నమూనాలతో పాటు పేడ, మూత్రం, పాలు తీసుకువచ్చి పరీక్షలు చేయిస్తున్నారు. తద్వారా పశువులకు సకాలంలో మంచి వైద్యం అందుతోంది. ఈ ప్రయోగశాల ద్వారా ఇప్పటి వరకు పది వేలకుపైగా పరీక్షలు చేశారు. ఇవే కాకుండా ముక్కు నుంచి కారే ద్రవాన్ని కూడా పరీక్షించి పశువులకు ఏ వ్యాధి సోకిందనే విషయాన్ని పాడి రైతులకు తెలియజేస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా 16 పశు వైద్యశాలలు

పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పాడి రైతుల కోసం 16 పశు వైద్యశాలలు, పశు వైద్యులు అందుబాటులో ఉన్నారు. పెడనలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం కూడా ఉంది. పెడనలో ఐదు, గూడూరులో ఐదు, బంటుమిల్లిలో మూడు, కృత్తివెన్ను మండలంలో మూడు పశు వైద్యశాలలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన పాడి రైతులు పశు వైద్యులకు చూపించిన అనంతరం వారి సూచనల మేరకు సదరు పశువులకు సంబంధించి ఏమైనా వ్యాధి లక్షణాలను నిర్ధారణ చేసుకోవడానికి రక్తం, పేడ, పాలు, మూత్రం, లేక ముక్కు నుంచి కారే ద్రవాన్ని పెడనలోని ప్రయోగశాలకు పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందుబాటులో రెండు సంచార వాహనాలు..

పాడి రైతులకు సంబంధించిన పాడి పశువులకు అత్యవసర సేవలు అందించేందుకు రెండు సంచార వాహనాలు నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నాయి. ఒకటి పెడనలోను, మరొకటి బంటుమిల్లిలోను ఉన్నాయి. పెడన, గూడూరులకు ఒకటి, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు మరొక వాహనాన్ని వినియోగిస్తున్నారు. మనుషులకు ఏ విధంగా 108 వాహనాలు ఉన్నాయో పశువులకు కూడా 1962 నెంబరు వాహనాలు ఏర్పాటు చేశారు. 1962కు డయిల్ చేస్తే సంచార వాహనం ఆ గ్రామానికి వెళ్లి పశు వైద్య సేవలను అందజేస్తోంది. ఈ వాహనంలో ఒక డాక్టర్, ఒక సహాయకుడు (ప్యారావెట్), డ్రైవర్‌తో కలిపి ముగ్గురుంటారు. 1962కు ఎవరైతే ఫిర్యాదు చేశారో వారి వివరాలు, ఏ పశువుకు ఎటువంటి లక్షణాలున్నాయి, వ్యాధి ఏమిటి తదితర వివరాలను ఈ వాహనానికి తెలియజేయడంతో సదరు వాహనంలోని వారు అప్రమత్తమై ఆ పాడి పశువుకు ఎటువంటి వైద్యం అందించాలి, దానికి సంబంధించిన మందులుంటే అందిస్తారు. మందులు అందుబాటులో లేకపోతే సమీపంలోని పశు వైద్యశాలకు వెళ్లి ఆయా మందులు తీసుకుని ఆయా గ్రామానికి చేరుకుని వైద్యం అందిస్తున్నారు. సకాలంలో తమ పశువులకు వైద్యం అందుతుండటంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

75 వేలకు పైగా పశువులు



పెడన నియోజకవర్గంలో 38,215 గేదెలు, 5,522 ఆవులు, 30,486 గొర్రెలు, 5,503 వరకు మేకలున్నాయి. ఇవి కాకుండా పెంపుడు కుక్కలు 500 వరకు ఉన్నాయి. మొత్తం 75 వేలకు పైగా ఉన్నాయి. వీటికి వైద్య సేవలతోపాటు పాడి పశువులకు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రస్తుతం పశువులకు బీమా చేస్తున్నాం. సంచార వాహనాల ద్వారా పాడి పశువులకు అత్యవసర సేవలు అందిస్తున్నాం. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రయోగశాల సత్ఫలితాలను ఇస్తోంది. చాలా మంది పాడి రైతులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– కొనకళ్ల బాబూరావు, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, పెడన

సాగర తీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ పోలీసులు

కోడూరు: హంసలదీవి సాగర తీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యాత్రికులు తీరంలోని ఇసుక తిన్నెలపై సేదతీరుతూ సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. మెరైన్ పోలీసులు పర్యాటకులకు తీరంలోని స్థితిగతులపై అవగాహన కల్పించారు. పాలకాయతిప్ప కరకట్ట చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. సాగర సంగమ ప్రాంతానికి వెళ్లే సముద్ర రహదారి కోతకు గురవడంతో పర్యాటకులను అక్కడికి అనుమతించలేదు.

ఈడేపల్లిలో 'చదువంటే మాకిష్టం'



అందుకున్న బహుమతులతో విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు పత్రికలు, కథల పుస్తకాలు చదివారు. వికాస్ తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, దేశభక్తిపై వక్తృత్వ పోటీలు, కృపాష్టకము శ్లోకాల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలు కె. రాజేంద్రప్రసాద్, పి. హరికిషన్‌ను సత్కరించారు. వికాస్ తరంగిణి ప్రతినిధి మాజేటి లక్ష్మీకాంతం, ఉపాధ్యాయిని లక్ష్మీ, సుధీష్ఠ, సుధ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ పాలకురాలు వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నంటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వలందపాలెంలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి. లంకేష్, జనరల్ సెక్రటరీలు డి. అశోక్‌కుమార్, జి. హృదయరాజు, ఎల్. సాయిశ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవీ రాజేంద్రప్రసాద్, జిల్లా కో-చైర్మన్ కె. రాజేంద్రప్రసాద్, కోశాధికారి ఏఆర్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

బంటుమిల్లి: యువ గణేష్ మోటారు సైకిల్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంటుమిల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు. ఏలూరు ఆశ్రం సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు పాల్గొని గుండె జబ్బులు, సాధారణ, చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు.

కోడి పందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడి పందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కంకిపాడు అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొడవర్రులో ఖాళీ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి కోడి పుంజు, రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీ తెలిపారు.

యూనిఫాం సివిల్ కోడ్‌పై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్ మౌలాలి

చల్లపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న యూనిఫాం సివిల్ కోడ్‌తో మైనారిటీలకు నష్టం కలుగుతుందని ముస్లిం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు షేక్ మౌలాలి అన్నారు. ఆదివారం స్థానిక నారాయణరావు నగర్ గౌసియా మస్జీదు, గ్రామంలోని మహమ్మదీయ మస్జీదుల్లో ముస్లింలకు యూనిఫాం సివిల్ కోడ్ కారణంగా కలిగే నష్టాలు వివరించారు.

మౌలాలీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత సామరస్యం, పరమత సహనం పరిఢవిల్లేందుకు అన్ని మతాలను, ఆయా మత విశ్వాసాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఐక్య వేదిక లీగల్ ఎడ్వైజర్ మహమ్మద్ మస్తాన్ మాట్లాడుతూ న్యాయవాదిగా తనకున్న అవగాహన ప్రకారం యూనిఫాం సివిల్ కోడ్ అమలు సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనలు విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు మహబూబ్ బాషా, అబ్దుల్ అజీజ్, బాషు భాయ్, షేక్ నబీషోరీ, హమీద్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

చిలకలపూడి(మచిలీపట్నం): ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు కుటుంబానికి ఆదివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. గొల్లపూడి మద్యం డిపోలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె. నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతుని భార్య నందినికి రూ. 3 లక్షల చెక్కును మచిలీపట్నంలోని నివాసంలో ఆదివారం అందజేశారు. అసోసియేషన్ నాయకుడు సుర కృష్ణ మాట్లాడుతూ నాగరాజు కుటుంబ సభ్యులకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిరంజీవి, శ్రీనివాస్, శంకర్, ఎస్. రామాంజనేయులు, శ్రీధర్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

పెనుమల్లిలో హెచ్‌సీ అంత్యక్రియలు

పెడన: పెడన మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పడమట శ్రీనివాస రామకృష్ణ అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో ఆదివారం జరిగాయి. శ్రీనివాస రామకృష్ణ ఏలూరు జిల్లా మండవల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వృత్తి రీత్యా రామకృష్ణ ముదినేపల్లిలో సెటిల్ అయ్యారు. రామకృష్ణ వదిన మృతిచెందడంతో ఆమె అంత్యక్రియలకు జూన్ 30వ తేదీన హాజరైన ఆయన గుండెపోటుకు గురయ్యాడు. బంధువులు మచిలీపట్నం వైద్యశాలకు తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. రామకృష్ణ స్వగ్రామమైన పెనుమల్లికి భౌతికకాయాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా అనీస్

ఉయ్యూరు: రోటరీ జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్‌గా సయ్యద్ అనీస్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తనను అసిస్టెంట్ గవర్నర్‌గా నియమించారన్నారు. అంతర్జాతీయ రోటరీ అధ్యక్షుడి పిలుపు మేరకు ఈ ఏడాది రోటరీ క్లబ్‌లు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో ఉయ్యూరు క్లబ్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు.

రైతులను గందరగోళానికి గురిచేయొద్దు

కంకిపాడు: వాస్తవ దూర కథనాలతో రైతాంగాన్ని గందరగోళానికి గురిచేయటం సరికాదని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి హితవు పలికారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దయలేదు...దగానే అన్నదాతకు శీర్షికన మరోసారి మొండి చెయ్యి వైఎస్సార్ బీమా అమలు నామమాత్రమే సారాంశంతో ఆదివారం ఓ పత్రికలో (సాక్షి కాదు) ప్రచురితమైన కథనాన్ని ఖండించారు. ఆ కథనం పూర్తిగా వాస్తవదూరంగా ఉందని తెలిపారు. మూడేళ్లుగా డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ఫలాలు అందుకుంటున్న రైతులను అయోమయంలో పడేసేలా ఉందని పేర్కొన్నారు. గ్రామం యూనిట్‌గా పంట కోత ప్రయోగాలలో నమోదైన దిగుబడి ఆధారంగా బీమా లెక్కించామని పేర్కొన్నారు. హామీ దిగుబడి కన్నా వాస్తవ దిగుబడి తగ్గిన చోట మాత్రమే బీమా వర్తిస్తుందని తెలియజేశారు. వాస్తవ దిగుబడి కృత్తివెన్ను మండలం నీలిపూడిలో తక్కువగా ఉండటంతో ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తయిన 495.93 ఎకరాల్లో 234 మంది రైతులకు రూ 57.44 లక్షలు బీమా క్లెయిమ్ ఈనెల 8న ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.

విజయవాడ, గుంటూరు వెళ్లి పింఛన్ల అందజేత



విజయవాడ ఆస్పత్రిలో వీరరాఘవమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రూపశ్రీ



గుంటూరు ఆస్పత్రిలో వృద్ధురాలు అబీరున్నీసాకు పింఛను అందజేస్తున్న వలంటీర్ జైబున్నీసా

మచిలీపట్నంటౌన్: 50వ డివిజన్‌కు చెందిన అడపా వీరరాఘవమ్మ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ వెక్కలగడ్డ రూపశ్రీ ఆదివారం విజయవాడలోని ఆస్పత్రికి వెళ్లి వీరరాఘవమ్మకు పింఛను మొత్తాన్ని అందజేసింది. అలాగే అదే డివిజన్‌కు చెందిన షేక్ అబీరున్నీసా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ జైబున్నీసా గుంటూరు ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛను అందజేసింది.

అపూర్వం.. ఆత్మీయ కలయిక

మచిలీపట్నంటౌన్: స్థానిక రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్ 1994–95 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు 28 ఏళ్ల అనంతరం ఆదివారం స్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. వృత్తి, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్న వీరంతా స్కూల్ ఆవరణలో ఉదయం కలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకుని విద్యార్థి దశ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వచనాలు పొందారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరంతా స్కూల్ ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు.



ఉపాధ్యాయినితో పూర్వ విద్యార్థులు

శాకంబరీ దేవిగా ముత్యాలమ్మ



పెడన: పట్టణ పరిధి పాతపేటలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అందంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు, స్థానిక పెద్దలు పర్యవేక్షించారు.

నేడు డిజిటల్ విద్యాబోధనపై శిక్షణ

పెడన: పెడన మండలంలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు మచిలీపట్నం, కంకిపాడు, బాపులపాడు, పెదపారుపూడి మండలాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని పెడన ఎంఈఓ-2 వైవీ హరనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఐదు స్పెల్‌లలో ఒక్కో స్పెల్‌కు రెండు రోజుల చొప్పున పది రోజుల పాటు దశల వారీగా శిక్షణ ఇస్తారని చెప్పారు. ఐఈపీ (ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్), స్మార్ట్ టీవీ, బైజూస్ వినియోగంపై శిక్షణ ఉంటుందని చెప్పారు. కోర్సు కన్వీనర్‌గా ఎంఈఓ-2 పెడన వారుంటారన్నారు. పెడన మండలంలోని ఉపాధ్యాయులకు విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని వివరించారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జామునుంచే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు క్యూ లైన్‌లో వేచియున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా భక్తులతో కోలాహలంగా మారింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బంటుమిల్లిలో గురు పూజోత్సవం

బంటుమిల్లి: యుగయుగాలుగా సనాతన ధర్మంలో గురువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవించారని ఆర్ఎస్ఎస్ విజయవాడ విభాగ్ శారీరక ప్రముఖ్ గౌరీశంకర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ బంటుమిల్లి ఖండ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామాలయంలో గురు పూజోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ కాషాయ ధ్వజాన్ని సంఘం ఎందుకు గురువుగా పెట్టుకుని పూజిస్తున్నది వివరించారు. సంఘంలో వ్యక్తి ఆరాధనకు తావులేదని, త్యాగానికి ప్రతిరూపమైన కాషాయ ధ్వజం గురువుగా పెట్టుకుని సంఘ కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నామన్నారు. విశిష్ట అతిథి, న్యాయవాది పళ్లెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం స్వయం సేవకులు భగవధ్వజానికి పూజ చేసి సమర్పణ చేశారు.